

పండగ శోభ ప్రతిబింబించాలి

పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో పవిత్రంగా నిలిచిపోయేలా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. - 8లో



ప్రాణం తీసిన పరుగు

ఇంజినీరింగ్ విద్యార్థి సాయికిరణ్ పరుగు పెడుతుండగా అకస్మాత్తుగా గుండె ఆగిపోయి మృతిచెందాడు. - 8లో



చంద్రబాబు అబద్ధాలకు హద్దు లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అబద్ధాలకు హద్దులు లేకుండా పోయాయని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆడలి వ్యూపాయింట్ సందర్శన



ఆడలి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ

సీతంపేట: స్థానిక ఏజెన్సీలోని ఆడలి వ్యూపాయింట్‌ను పాలకొండ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ గురువారం సందర్శించారు. ఈ మేరకు వ్యూపాయింట్ అందాలను వీక్షించారు. ప్రతి రోజూ ఎంతమంది పర్యాటకులు వస్తున్నారన్న విషయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా వ్యూపాయింట్ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం శంభాం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ నాగభూషణరావు, డీపీవో వై.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

తిత్తిరిలో ఏనుగుల గుంపు తిష్ఠ

- వరి, చోడి, మొక్కజొన్న పంటల ధ్వంసం



తిత్తిరిలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు

కురుపాం: నియోజకవర్గానికి ఏనుగుల గుంపు నుంచి సమస్యలు తప్పడం లేదు. తూర్పు ముఠా వైపు ఒక ఏనుగుల గుంపు, మైదాన ప్రాంతంలో మరో ఏనుగుల గుంపు తిష్ఠ వేసిన కారణంగా పంటలు ధ్వంసం అవుతుండడంతో పాటు రైతుల ప్రాణాలు పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుముఠా ప్రాంతమైన తిత్తిరి పంచాయతీలో మూడు నెలలుగా తిష్ఠ వేసిన ఏనుగులు బుధవారం అర్ధరాత్రి హిమరిక అడ్డాయి, మండంగి గురుమూర్తికి చెందిన వరి, చోడి, మొక్కజొన్న, అరటి పంటలను ధ్వంసం చేయడంతో చేతికి అందివచ్చిన పంటలు నేల పాలయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అటవీశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని అధికారులు స్పందించి పంటనష్టం తోపాటు ఏనుగుల నుంచి తమను, తమ పంటలను రక్షించాలని కోరుతున్నారు.

అల్లానికి గిరాకీ



వ్యాపారులు కొనుగోలు చేసిన అల్లం

కురుపాం: గిరిజనులు సాగు చేస్తున్న అల్లానికి కురుపాం మార్కెట్‌లో మంచి గిరాకీ లభించింది. ఈ మేరకు గురువారం కురుపాంలో జరిగిన వారపు సంతకు గిరిజన రైతులు విక్రయానికి తీసుకొచ్చిన అల్లం కేజీ రూ.35 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ మధ్య కాలంలో కురుస్తున్న వర్షాల కారణంగా అల్లం దిగుబడి పెరిగిందని గిరిజన రైతులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలైన విజయనగరం, విశాఖ వంటి నగరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నందున దేశవాళీ అల్లానికి మరింత ధర పలుకుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు.

బేస్‌బాల్ జాతీయ స్థాయి విజేతకు జేసీ అభినందనలు

విజయనగరం అర్బన్: కోయంబత్తూర్‌లో ఇటీవల జరిగిన బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన కొత్తవలస మండలం గనిశెట్టిపాలెం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ పాలిపిరెడ్డి శ్రీనును జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ గురువారం అభినందించారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించి జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారని ప్రశంసించారు.

పోక్సోకేసులో వీఆర్‌ఏ అరెస్టు

బొబ్బిలి రూరల్: మండలంలోని గోపాలరాయుడిపేటకు చెందిన వీఆర్‌ఏను పోక్సో కేసులో పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓ బాలికకు మాయమాటలు చెప్పి గ్రామంనుంచి వీఆర్‌ఏ తీసుకుపోయాడు. దీనిపై పోలీస్ స్టేషనల్ బాలిక తల్లి మే 3వ తేదీన ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక పోలీసుల కంటపడకుండా విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో తిప్పుతూ వీఆర్‌ఏ జాగ్రత్తపడ్డాడు. పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలతో గాలించి పట్టుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ వ్యవహారం పోక్సో పరిధిలోకి రావడంతో డీఎస్పీ జి.భవ్యారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

‘ఏరుదాటే వరకు సోమలింగం.. ఏరుదాటాక బోడిలింగం’ అన్న తీరును టీడీపీ నేతలు బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలపై ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపునకు కారణమైన నాయకులను కరివేపాకులా తీసిపడేస్తున్నారు. కనీసం ఫ్లెక్సీలు పెట్టుకునే అర్హత లేదంటూ చేతలతో చెబుతున్నారు. చివరకు మీరు నాయకులే కాదంటూ గేలిచేస్తున్నారు. ఆ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను వెంట వెంటనే డంపింగ్‌యార్డుకు తరలించేలా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు విజయనగరంలో చర్చనీయాంశంగా మారింది. ఎవరిపొయ్యి వారు వెలిగించుకుంటే గౌరవం తప్ప... మన పొయ్యిను వెలిగించమని ఇంకొకరి చేతిలో దీపం పెడితే ఇలాగే అవమానాలు పడాల్సి వస్తుందన్న అభిప్రాయం ఆ రెండు పార్టీల నాయకులు వ్యక్తంచేస్తున్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానం వద్ద తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.



మమ్మల్ని ఎవడ్రా ఆపేది..!

- విజయనగరం సిటీలో టీడీపీ పెద్దరికం
- బీజేపీ.. జనసేనలకు ఫ్లెక్సీలు పెట్టుకునే ఛాన్స్‌కూడా లేదు..
- పల్లకి మోయడానికి మాత్రమే భాగస్వామ్యం
- గెలిచాక పెద్ద చెరువుగట్టు మీదనే స్థానం

సాక్షిప్రతినిధి విజయనగరం:

వాస్తవానికి మమ్మల్ని ఎవడ్రా ఆపేది అనే నినాదం జనసేనవాళ్లది.. కానీ అదేం ఖర్మో వాళ్లను అందరూ.. అన్ని చోట్లా ఆపేవాళ్లే. ఆఖరుకు ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్దామన్నా టీడీపీ వాళ్లు పైనుంచి కిందవరకూ ఓ సారి తేరిపార చూసి మీరు అవతలకు వెళ్లండమ్మా అనేస్తున్నారు. వాళ్లను కనీసం భాగస్వామ్య పక్షాలుగా కూడా రాజకీయపార్టీ కార్యకర్తలుగా పరిగణించడంలేదు. జస్ట్ డబ్బులిస్తే పనిచేసే కూలీలుగా మాత్రమే చూస్తున్నారు. ఇక రాష్ట్రంలో ప్రతిసారీ తెలుగుదేశం విజయానికి దోహదపడే బీజేపీది కూడా ఇంచుమించు అదే స్థాయిలో ఉంది. విజయనగరం జిల్లాలో.. ముఖ్యంగా పట్టణంలో అయితే తెలుగుదేశం మినహా.. భాగస్వామ్య పార్టీలకు వీసమెత్తు విలువలేకుండా పోయింది. అదేదో సినిమాలో మంత్రి పాత్రధారి రావు రమేష్ ‘చెప్పులు మనలను మోస్తున్నాయి కదాని వాటిని బెడ్ రూములోకి తీసుకెళ్లలేం కదా.. వాటిని గుమ్మంలోనే వదిలేయాలి..’ అంటాడు.. పాపం ఇప్పుడు విజయనగరంలో జనసేన.. బీజేపీల పరిస్థితి చెప్పులకన్నా దారుణంగా తయారైంది.. ఆఖరుకు తమ నాయకుల పుట్టినరోజులు ఫ్లెక్సీలు కూడా పెట్టుకోలేని దైన్యం.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- పెట్టిన వెంటనే తొలగింపు...

ఇటీవల పవన్ కళ్యాణ్ పుట్టినరోజున పట్టణంలో జనసైనికులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.. అయితే వాళ్లు ఇలా ఫ్లెక్సీలు పెట్టిన ఒక పూట కూడా గడవకముందే మున్సిపల్ అధికారులు తొలగించారు.

టీడీపీది కపటప్రేమ



కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీలకు సమప్రాధాన్యం ఇవ్వాలి. కానీ కేవలం తెలుగు దేశం ఒక్కటే ప్రభుత్వం అన్నట్లు ఉంటే ఎలా..? పట్టణంలో జనసేన.. బీజేపీలకు బలం లేదని చెప్పి.. మున్సిపల్ ఎన్నికల్లో మాకు సీట్లు ఎగ్గొట్టడమో.. తక్కువ సీట్లు ఇవ్వడమో .. ఇలాంటి కుట్రలు పన్నడానికే ఈ ఫ్లెక్సీల తొలగింపు అనిపిస్తోంది. ఎన్నికల్లో గెలిచేవరకు అందరం ముఖ్యం అని కపట ప్రేమ చూపించిన టీడీపీ నాయకులు గెలిచాక మమ్మల్ని చిన్న చూపు చూడడం చాలా బాధాకరం. ఈ అంశాన్ని మేము మా పెద్దలవద్దకు తీసుకెళ్లి మా గౌరవాన్ని కాపాడుకుంటాం.

– గురాన అయ్యలు, జనసేన పార్టీనాయకులు

నిన్న ప్రధాని మోదీ పుట్టినరోజునాడు బీజేపీ క్యాడర్ కూడా ఏదో బలప్రదర్శన చేద్దామని ఎక్కడా స్థలం లేనట్లు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పేరిట పెట్టిన ఫ్లెక్సీలు పైన బీజేపీ ఫ్లెక్సీలు పెట్టుకునే స్థాయికి దిగజారిపోయారు. ఇలా ఫ్లెక్సీలు పెట్టిన కాసేపట్లోనే వాటిని కూడా తీసేశారు. దీనికోసం ఆఖరుకు బీజేపీ నాయకులు మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేయాల్సిన దుస్థితి నెలకొంది. అదేం చిత్రమో కానీ.. టౌన్ మొత్తం తెలుగుదేశం ఫ్లెక్సీలు కనిపిస్తాయి. వాటిని మాత్రం మున్సిపాలిటీ వారు కనీసం టచ్ చేయలేరు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంటి చుట్టూ.. రైతుబజార్ వద్ద.. ఆయన ఇంటికి వెళ్లే రోడ్డు మొత్తం ఫ్లెక్సీలు ఉంటాయి కానీ అవేమీ మున్సిపాలిటీవారికి కనిపించవు. ఇక అశోక్ బంగ్లా గేటు ఎదురుగా భారీ ఫ్లెక్సీలు నిత్యం ఉంటాయి. వాటిని కూడా కార్పొరేషన్ సిబ్బంది ముట్టుకునే ధైర్యం చేయరు.

ఆ రెండు వర్గాల ఫ్లెక్సీలపైనే అక్కసు..

కేవలం బీజేపీ.. జనసేన నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు మాత్రమే ఎత్తేసి కార్పొరేషన్ సిబ్బంది వ్యాన్లలో పడేస్తున్నారు. మున్సిపల్ అధికారులు.. కమిషనర్ తదితరులు కేవలం టీడీపీకి విధేయత చూపిస్తే చాలనుకుంటున్నారని.. అందుకే మా ఉనికి కూడా పట్టణంలో ఉంచడం లేదని జనసేన క్యాడర్ వాపోతోంది. ఇక బీజేపీ వారు అయితే మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ ఫ్లెక్సీలు తొలగింపు మీద ఆవేదన.. ఆక్రోశం వెళ్లగక్కడం మినహా ఏమీ చేయలేకపోయారు. ప్రధాని బర్త్‌డేకు ఫ్లెక్సీలు పెట్టినా వెంటనే తీసేస్తున్నారని బయటకు ఏడవలేక.. ఎవరికీ చెప్పుకోలేక.. అదోరకమైన భావనలోకి వెళ్లిపోయారు. టౌన్‌లో కేవలం టీడీపీ వారివి.. అది కూడా ఎమ్మెల్యే అదితి గజపతి ఫ్లెక్సీలు మాత్రమే ఉండాలని.. ఎన్నాళ్లయినా ఉండాలని ఒక అనధికార నిబంధన మున్సిపాలిటీలో జారీ అయిందని అంటున్నారు. ఇక మిగతావారివి ఎవరైనా ఫ్లెక్సీ పెడితే కనీసం ఒక పూట కూడా కాకుండా డంపింగ్ యార్డులోకి చేర్చాలన్నది ఆదేశమట. ఆఖరుకు టీడీపీ పల్లకీ మోయడానికి పనికొచ్చే జనసేన, బీజేపీల బోయీలు.. వారి స్థానం మాత్రం పెద్ద చెరువు గట్టు మీదనే అని తెలుగు దేశం నాయకులు చెప్పకనే చెబుతున్నారు.

264 గ్రామాలకు త్వరగా ‘దారి’ చూపాలి

- కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర్ రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో డోలీ మోతలు నివారించేందుకు రహదారి సౌకర్యం లేని గిరిజన ప్రాంతాల్లో గల ఏడు మండలాలైన కొమరాడ, పాచిపెంట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని, సీతంపేట, జియ్యమ్మవలసలలో గల 264 గ్రామాలను గుర్తించామని, వాటికి ప్రాధాన్యం ఇస్తూ ఇంజినీరింగ్ అధికారులు వీలైనంత వేగంగా రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో గిరిజన ప్రాంతాల్లో రహదారుల సౌకర్యంపై జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారి సౌకర్యాలు లేని గ్రామాలకు రహదారులు కల్పించే వెసులుబాటు ఉందన్నారు. ఈ మేరకు గిరిజన ప్రాంతాల్లో కనీస రహదారి సౌకర్యానికి నోచుకోని గ్రామాలను గుర్తించి సంబంధిత అధికారులను, బృందాలుగా ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో భాగంగా డోలీమోతలకు తావులేకుండా ఆయా గ్రామాలకు ప్రాధాన్యం ఇస్తూ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రా విధానంలో మద్యం షాపు కేటాయింపు



డ్రా తీస్తున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఐదు మద్యం దుకాణాలకు (బార్) డ్రా విధానంలో అనుమతులు కేటాయించాల్సి ఉండగా సాలూరు నియోజకవర్గం పరిధిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు రాగా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి అబ్కారీశాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం డ్రా తీశారు. ఈ మేరకు విజయనగరం జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ బి.జీవన్ కిశోర్ వివరాలు వెల్లడిస్తూ సాలూరు నియోజక వర్గానికి కేటాయించిన ఈ బార్‌కు ఒకే వ్యక్తి నాలుగు దరఖాస్తులు వేశారని, దీంతో కలెక్టర్ డ్రా తీసి వచ్చిన నంబర్ మేరకు ఆనందరావు అనే వ్యక్తికి షాపు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.20.4 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ ఎ.సంతోష్, ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌బాబు, సాలూరు అబ్కారీ శాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.దాసు, సిబ్బంది మిండిబోను రమేష్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ వైద్య విద్య పరిరక్షణే ధ్యేయంగా..

- నేడు చలో వైద్య కళాశాల
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పనున్న పార్టీ నాయకులు



శత్రుచర్ల పరీక్షిత్ రాజు

సాక్షి, పార్వతీపురం మన్యం: పేదవాడికి నాణ్యమైన ఉచిత వైద్యం, మెడికల్ విద్య చేరువ చేయాలన్న గత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ లక్ష్యానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో ప్రారంభం కావలసిన వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు వైద్య కళాశాలలను కట్టబెట్టేందుకు నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ..పేద ప్రజలకు అండగా నిలిచేందుకు.. జిల్లా వాసులకు వాస్తవాన్ని తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ప్రభుత్వ వైద్యవిద్య పరిరక్షణే ధ్యేయంగా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు..వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ‘చలో మెడికల్ కాలేజీ’ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టనున్నారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు తెలిపారు. విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకుని..ప్రజలు, మీడియాకు వాస్తవాలను తెలియజెప్పనున్నారని పేర్కొన్నారు.

తరలిరానున్న పార్టీ నాయకులు

శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో మెడికల్ కళాశాల కార్యక్రమంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొని మద్దతుగా నిలవనున్నారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని నియోజకవర్గ వర్గాల సమన్వయకర్తలతో పాటు.. పార్వతీపురం జిల్లా నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు పీడిక రాజన్న దొర, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, ఎమ్మెల్సీ విక్రాంత్ బాబు తదితరులు పాల్గొంటారని పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శత్రుచర్ల పరీక్షిత్ రాజు కోరారు.

చలో మెడికల్ కాలేజీని విజయవంతం చేయండి



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదనీటిని దాటుతున్న గిరిజన యువత

రాకపోకలు ఆపిన అడారుగెడ్డ

- ఉధృతంగా కాజ్‌వేపై నీటి ప్రవాహం
- బిక్కుబిక్కుమంటూ గిరిజనుల రాకపోకలు
- వారపుసంతకు వచ్చిన వారికి తప్పని కష్టాలు



వరద ఉధృతి తగ్గుదల కోసం గెడ్డఒడ్డున వేచిచూస్తున్న గిరిజనులు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న దృశ్యాలు చూస్తే ఏవిధంగా గిరిజనులు బిక్కుబిక్కుమంటూ గెడ్డను దాటుతున్నారో అర్థమవుతుంది. రెక్కాడితే కానీ, డొక్కాడని బతుకులు వారివి. వాగులు, గెడ్డలు పొంగుతున్న వేళ ఊరుదాటలేక, వస్తులతో గడపలేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. మక్కువ మండలం, పనసభద్ర పంచాయతీ దుగ్గేరు, మెండంగి గ్రామాల మధ్య అడారుగెడ్డ ఉంది. ఒడిశా రాష్ట్రంలో వర్షంకురిస్తే, చడీచప్పుడు లేకుండా అమాంతంగా అడారుగెడ్డ ప్రవహిస్తుంటుంది. అడారుగెడ్డపై నుంచి మక్కువ, సాలూరు మండలాలకు చెందిన గిరిశిఖర గ్రామాల ప్రజలు, పక్కన ఉన్న ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లాకు చెందిన పలు గ్రామాలతో కలిపి మొత్తం 35గ్రామాలకు చెందిన గిరిజనులు రాకపోకలు సాగించాల్సి ఉంది. గురువారం దుగ్గేరు గ్రామంలో వారపు సంత జరిగింది. ఈ సంతకు వచ్చిన గిరిజనులు అడారుగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు సాగించలేక అవస్థలు పడ్డారు. స్థానిక యువత వారపుసంతకు వచ్చిన గిరిజనులను గెడ్డ దాటించగా, వాహనాల రాకపోకలకు అవకాశం లేకపోవడంతో, గెడ్డ ఒడ్డున గంటలకొద్దీ సమయం వేచిచూడసాగారు.

–మక్కువ

యూరియా కట్టకటలు

బలిజిపేట: ఒక యూరియా కట్ట (బస్తా) కోసం ఎండలో క్యూలో నిల్చుని, పని మానుకుని, తిండిలేక కాపలాకాస్తే అది దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు అల్లాడు తున్నారు. రైతులకు యూరియా కష్టాలు తీరడంలేదు. ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి. వచ్చిన యూరియా బస్తాలు రైతులకు చేరుతున్నాయా? లేదా పక్కదోవ పడుతున్నాయా? అన్నది చర్చనీయాంశమైంది. బలిజిపేట మండలంలోని వెంగాపురంలో మన గ్రోమోర్ వద్ద గురువారం నాటి పరిస్థితి ఇది. గ్రోమోర్‌కు యూరియా వచ్చిందని తెలియగానే రైతులు అక్కడ బారులు తీరారు. కొంత సమయం తరువాత స్లిప్పులు ఇవ్వడం ఆపేశారు. ఎందుకు ఇవ్వలేదంటే యూరియా అయిపోయింది. మరిలేదని అధికారుల సమాధానం. ఎంత యూరియా వచ్చిందో? ఎవరికి ఇస్తున్నారో? ఏమవుతోందో? తెలియడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అంతస్థాకు కనిపించినా రైతులకు అందేది అరకొర మాత్రమేనని మిగిలింది ఏమవుతోందని తెలియరావడం లేదని వాపోతున్నారు.



వెంగాపురంలో మనగ్రోమోర్ వద్ద బారులు తీరిన రైతులు

క్లుప్తంగా

మరో నాలుగు బార్లకు అనుమతి

విజయనగరం రూరల్: జిల్లాలో మరో నాలుగు బార్లకు అనుమతి మంజూరైంది. నూతన బార్ పాలసీ ప్రకారం కొత్త బార్లు ఏర్పాటు కోసం కలెక్టరేట్‌లో గురువారం లాటరీ తీశారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పాల్గొని, ఆయన చేతులమీదుగా లాటరీ తీయించారు. జిల్లా వ్యాప్తంగా 31 బార్లు ఉండగా, వాటిలో 16 బార్లకు రెండు విడతల్లో లాటరీ ప్రక్రియ నిర్వహించి, లైసెన్స్ మంజూరు చేశారు. మిగిలిన 16 బార్లకు మూడో విడత కింద దరఖాస్తులు ఆహ్వానించగా గడువు ముగిసే సమయానికి నాలుగు బార్లకు 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు లాటరీ తీసి, కొత్త బార్లకు అనుమతులు ఇచ్చారు. దీని ద్వారా రూ.81.6 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు ఆదాయం లభించినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

లారీ ఢీకొని రెండు ఎద్దుల మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఎద్దులు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై గురువారం లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందగా రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున సుమారు 5.30 గంటల జగ్గునాయుడుపేట గ్రామం నుంచి ఇసుక తీసుకుని వెళ్లడానికి సీతానగరానికి రెండు నాటు బళ్లు వస్తుండగా అదే సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల ఎదురుగా రెండు నాటుబళ్లను లారీ ఢీకొట్టింది. దీంతో ముందు నాటు బండి తోలుతున్న రెడ్డి తిరుపతిరావుకు చెందిన ఒక ఎద్దు, రెండవ నాటు బండి తోలుతున్న పెంట పోలీనాయుడుకు చెందిన ఒక ఎద్దు సంఘటనా స్థలంలోనే మృతి చెందాయి. ముందు నాటుబండి తోలుతున్న రెడ్డి తిరుపతిరావుకు స్వల్ప గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన పరుగు

● ఆగిపోయిన ఇంజినీరింగ్ విద్యార్థి గుండె



సాయికిరణ్ మృతదేహం



సాయికిరణ్(ఫైల్)

విజయనగరం క్రైమ్: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సాయికిరణ్ పరుగు పెడుతుండగా అకస్మాత్తుగా గుండె ఆగిపోయి మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న సాయికిరణ్ ఎన్‌సీసీపై ఇష్టంతో కాలేజీలో గురువారం జరిగిన ఎంపికల్లో పాల్గొన్నాడు. ఈ ఎంపికలో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగులో సాయికిరణ్ పరుగెత్తి ఒక్కసారిగా కింద పడిపోయాడు. వెంటనే కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థి వివరాలు కనుక్కొని..పేరెంట్స్‌ను సంప్రదించి హుటాహుటిన ప్రభుత్వం హాస్పిటల్‌కు తీసుకువెళ్లడంతో వైద్యులు చికిత్స చేస్తుండగా సాయికిరణ్ మృతి చెందాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయికుమార్ తండ్రి పోలినాయుడు ఎన్నో ఆశలతో తన కొడుకును ఇంజినీరింగ్ చదివించి ఉన్నతస్థానంలో చూడాలనుకున్న ఆయన ఆశలు ఆవిరయ్యాయి. మృతుడికి తల్లి సుజాత, తండ్రి పోలినాయుడు, వివాహమైన, సోదరి శ్రావణి ఉన్నారు.

21న అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం: ఈనెల 21న అండర్–14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు (రాంబాబు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాబా మెట్ట శివారు విజ్జి స్టేడియంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు వారి సొంత క్రికెట్ కిట్టు, ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకురావాలని, అలాగే తెలుపు దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

పండగ శోభ ప్రతిబింబించాలి

● సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ దర్శనాలు
● పైడితల్లి అమ్మవారి పండగ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష





సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల జిల్లా అధికారులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో పవిత్రంగా నిలిచిపోయేలా నిర్వహించాలని, పండగ శోభ ప్రతిబింబించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. ప్రతి దశలోనూ అధికారుల మధ్య సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పండగ ఏర్పాట్లపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల వారికి కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని, సిరిమాను పవిత్రతను కాపాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా పండగ నిర్వహించాలన్నారు. వీవీపీ దర్శనాల వల్ల సాధారణ భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో ఎక్కడా రోడ్డుపై గుంతలు లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం, రక్షిత తాగునీటి సరఫరా, బయో టాయిలెట్స్ ఏర్పాటు, నగరమంతా సుందరీకరణ, విద్యుత్ అలంకరణ తదితర పనులను మున్సిపల్ శాఖ నిర్వహించాలని సూచించారు. పండగలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చూడాలని, క్యూల వద్ద ఏర్పాటు చేసిన తాగునీరు పేపర్ గ్లాస్‌ల ద్వారా అందించాలని వాటిని జాగ్రత్తగా వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రసాదాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేయాలని అలాగే అన్ని ఆర్‌ఓప్లాంట్లను ఆర్‌డీఓ ఆధ్వర్యంలో తనిఖీ చేయాలని సూచించారు.

శాంతిభద్రతల లోపం ఉండరాదు

వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్సకు అవసరమైన మందులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా 6, 7 తేదీల్లో తొలేళ్లు, సిరిమాను ఉత్సవం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు వస్తారని శాంతిభద్రతల లోపం లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు.

వాహనాల పార్కింగ్‌కు తగు ఏర్పాట్లను చేయాలని, పోలీస్, ఫైర్ శాఖల అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బారికేడింగ్ ఎత్తు పెంచాలని లేదంటే పైనుంచి దూకి వస్తున్నారని పోలీస్ వారు చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ 4 అడుగుల నుంచి 5 అడుగులకు పెంచాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. తెప్పోత్సవంలో గజ ఈతగాళ్లు ఉండాలని, మత్స్యవారికీ, తెప్పలను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ శాఖకు సూచించారు.

నగరమంతా సుందరీకరించాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అక్టోబర్ 1 నుంచి 7 వరకు నగరమంతా సుందరీకరణ చేయాలని ఎంఎస్‌ఎంఈ మంత్రి సూచించారని, ఆయన ఆదేశాల మేరకు సోషల్ మీడియా, సుందరీకరణ, ఎల్.ఈ.డీ స్క్రీన్ల ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ దాట్ల కీర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, పూజారి బంటుపల్లి వెంకటరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి లక్ష్య సాధనకు కృషి చేయాలి

● కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం పనికిరాదని సూచించిన గడువుకు ముందే ప్రగతిని సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్, విద్య, విద్యుత్, మున్సిపాల్టీ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యానవన రంగాల్లో బహుళ పంటల దిశగా ఆలోచన చేయాలని తద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతారన్నారు. అలాగే జిల్లాలో ఈ–పంట నమోదు శతశాతం జరగాలని చెప్పారు.

రైతు సేవా కేంద్రాల వారీగా వర్క్‌షాపులు

రైతు సేవా కేంద్రాల వారీగా వర్క్‌షాపులు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు డ్రోన్స్ వాడకంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అలాగే అటవీ సంపద పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో పశుసంపద మరింత వృద్ధి ఉండాలని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశుసంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్, టి.సంతోష్‌కుమార్, ఏవీ సాల్మన్‌రాజు, డా.ఎస్. మన్మథరావు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు సుధారాణి, కనకదుర్గ, మరికొంతమంది అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత

● జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: బంగారు కుటుంబాల దత్తత స్వచ్ఛందంగానే ఉంటుందని మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో పీ4 బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో వార్డు సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇందులో ఎలాంటి ఒత్తిడి లేదని, స్వచ్ఛందంగా ఇష్టపూర్వకంగానే రావాలని కోరారు. అలాంటి వారినే మార్గదర్శిగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని కచ్చితంగా పాటించాలన్నారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు అలాగే అన్ని వర్గాల్లోను వారే స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగ బాధ్యతతో పాటు సామాజిక స్పృహ కూడా ఉండాలని హితవు పలికారు. ఒక మార్గదర్శి బంగారు కుటుంబాలకు ఆర్థికంగా అయినా, ఇతర సహాయ సహకారాలు అందించైనా ఆదుకోవచ్చునని తెలిపారు. ఈ మేరకు పూర్తి అవగాహన కల్పిస్తూ మార్గదర్శుల పేర్లను పీ4లో నమోదు చేయాలని సూచించారు. అలాగే వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని చెప్పారు. శిక్షణ తరగతుల కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి ఆర్‌కె పట్నాయక్, స్టాటిస్టికల్ రాష్ట్ర పరిశీలకుడు లతీఫ్, రాష్ట్ర శిక్షకుడు శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లాలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూట్ మిల్లు భూముల కోసం కూటమి నాయకుల కుట్ర

● భూములు డొంకినవలస రైతులకే చెందాలి
● మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: భూములిచ్చిన ప్రతి రైతుకు జూట్‌మిల్లులో ఉద్యోగం ఇస్తామని, బాడంగి మండలం డొంకినవలస ఎత్తు కానా వద్ద 80వ దశకంలో రైతుల వద్ద సేకరించిన సుమారు 32 ఎకరాల భూములు ఆ ఫ్యాక్టరీ నిర్మించనందున తిరిగి రైతులకే చెందాలని మాజీఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాడంగి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. మహవీర్ కంపెనీ ప్రతినిధులు సేకరించిన భూములకు సంబంధించి డమ్మీ నాయకులు తయారై మ్యుటేషన్‌కు సిద్ధమవుతున్నారని, దీనిని ఖండిస్తున్నానన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తో మ్యుటేషన్‌కు ప్రయత్నాలు

గతంలో ఇక్కడున్న తహసీల్దార్ సుధాకర్ అటువంటి పనులకు ఒప్పుకోరని ట్రాన్స్‌ఫర్ చేయించి ఆయన స్థానంలో పక్క మండలంలో పనిచేస్తున్న ఓ డీటీకి ఎఫ్‌ఏసీ ఇచ్చి నియమించుకున్నారని, ఇప్పుడా ఇన్‌చార్జి తహసీల్దార్‌తో మ్యుటేషన్‌కు ఆమోదం చెప్పేందుకు కూటమి నాయకులు కొత్త ఎత్తుగడ వేశారని ఆరోపించారు. ఆ భూములు ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు మండల స్థాయి నుంచి కలెక్టర్ వరకూ నగదు కూడా చేతులు మారినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై తాను రెండు రోజుల క్రితం ఆర్డీఓ రామమోహనరావు, కొత్తగా వచ్చిన తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఆ భూములు అక్కడ ఉన్న రైతులకు చెందాలని చెప్పానన్నారు. కూటమి నాయకులు, ఇతర వ్యక్తులు ఆ భూములను హస్తగతం చేసుకుంటామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. దీనిపై ఎందాకైనా వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, గూడెపువలస రాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి 'పవిత్రాల సమర్పణ'

● మంగళవాయిద్యాలతో వైభవంగా పట్టు పవిత్రాల ఊరేగింపు
● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం
● నేడు స్వామివారికి పట్టాభిషేక మహోత్సవం



పవిత్రాల అలంకరణలో శ్రీ రామచంద్ర స్వామి



స్వామివారి పట్టు పవిత్రాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో స్వామివారికి పట్టు పవిత్రాల సమర్పణ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువజామున ప్రాతఃకాలార్చన పూజలనంతరం మంగళాశాసనం, తీర్థ గోష్ఠి కార్యక్రమాలను జరిపించారు. పారాయణాలు, జపాలు, హవనాలు నిర్వహించి అష్ట కలశ స్నపన మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం దేవస్థానం అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద ఋత్విక్కుల ఆధ్వర్యంలో పట్టు పవిత్రాలను మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం వెలుపల ఊరేగించి సీతారామస్వామికి సమర్పించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో పాటు పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించనున్నామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, రామగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ



విశాఖలో జరిగిన కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన చీపురుపల్లి బాలికల జట్టు

చీపురుపల్లి: జోనల్‌స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. విశాఖపట్నంలోని మహిళా డిగ్రీ కళాశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్కడ జోనల్ స్థాయి బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీజీ.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.జ్వాలాముఖి, పీఈటీ పి.రామలక్ష్మి తదితరులు విద్యార్థినులను అభినందించారు.

కుక్కలు కరిచి ఆరుగురికి గాయాలు

మెంటాడ: మండల కేంద్రంలో గురువారం ఆరుగురిని కుక్కలు కరవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ మేరకు గాయాలపాలైన వారిని కుటుంబ సభ్యులు వైద్యసేవల కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులకు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం తీవ్రగాయాలైన కె.అప్పలనాయుడు, పి.శంకరరావులను గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ లోకప్రియ తెలిపారు.

దుండగుల దుశ్చర్య



పోలీస్‌స్టేషన్ సమీపంలో దుండుగులు చించివేసిన ఫ్లెక్సీ

నెల్లిమర్ల: మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు సందర్భంగా స్థానిక నగరపంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయన అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆయన బర్త్‌డే ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు చించివేశారు. స్టేట్‌బ్యాంకు, రామతీర్థం జంక్షన్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించగా, పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మరో ఫ్లెక్సీని చించివేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇదేం పని? ఇది మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలను రాజకీయ నాయకులెవరూ ప్రోత్సహించకూడదని హితవు పలుకుతున్నారు.

కన్నకొడుకే..కాలయముడు

● మద్యం మత్తులో తండ్రిని రాయితో కొట్టిన కుమారుడు
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన తండ్రి



ఎం.ఆర్ అగ్రహారంలో దర్యాప్తు చేస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, క్లూస్ టీం



చిన్నకుమారుడు రాయితో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అప్పలస్వామి



అప్పలస్వామి(ఫైల్)

తెర్లాం: కనిపెంచిన కుమారుడే కన్న తండ్రి పట్ల కాలయముడయ్యాడు. మద్యం తాగిన మైకంలో కుమారుడు రాయితో కొట్టడంతో తండ్రి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చెందిన సంఘటన తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారం గ్రామంలో సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించి బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు గురువారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎంఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన నగరపు అప్పలస్వామి(85)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరికి తన భూమిని పంచిపెట్టి, తన పోషణ నిమిత్తం ఒక ఎకరా భూమిని అప్పలస్వామి ఉంచుకున్నాడు. వృద్ధాప్యంలో ఉన్న అప్పలస్వామిని పెద్దకుమారుడు తన వద్ద ఉంచుకుని తండ్రిని పోషిస్తున్నాడు. తన వద్ద ఉన్న ఎకరా భూమి సాగు చేసుకునేందుకు పెద్ద కుమారుడికి తండ్రి ఇచ్చాడు. తండ్రి వద్ద ఉన్న భూమి తనకు సాగు చేసుకునేందుకు ఇవ్వాలని చిన్న కుమారుడు శంకరరావు అడగ్గా తండ్రీకొడుకుల మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో శంకరరావు రాయి తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడిన అప్పలస్వామిని తెర్లాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి నిమిత్తం మనుమరాలు నగరపు కల్పన, ఇతర కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తలకు స్కానింగ్ చేయించి తీసుకురమ్మని వైద్యులు చెప్పడంతో స్కానింగ్ తీయించి తీసుకువచ్చారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం అప్పలస్వామి మృతి చెందాడు.

పరిశీలించిన సీఐ

ఈ సంఘటనకు సంబంధించి అందిన సమాచారంతో ఎస్సై సాగర్‌బాబు, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. అప్పలస్వామి మృతదేహానికి కుటుంబసభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి మనుమరాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెర్లాం ఎస్సై సాగర్‌బాబు హత్య కేసు నమోదు చేయగా, బొబ్బిలి రూరల్ సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కోసం అవస్థలు



వల్లూరు రైతుసేవా కేంద్రానికి పోటెత్తిన రైతులు



చంద్రంపేట రైతుసేవా కేంద్రం వద్ద అన్నదాతల పడిగాపులు

నెల్లిమర్ల రూరల్: యూరియా కోసం రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. మండలంలోని వల్లూరు, చంద్రంపేట రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం అందిస్తామని అధికారులు సమాచారం ఇవ్వడంతో వేకువజాము నుంచే ఆయా కేంద్రాల వద్దకు రైతులు పోటెత్తారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే అక్కడకు వచ్చిన వారికి సరిపడా యూరియా బస్తాలు పంపిణీ చేయకపోవడంతో నిరాశ చెందారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రెండు నెలలుగా ఇన్ని బాధలు పడుతుంటే ప్రభుత్వానికి పట్టదా అని నిలదీస్తున్నారు. యూరియా వేసే సమయం దాటిపోతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధి మందరాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్న మహిళకు అస్సాంలో కేంద్రం ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి ఇపుడు పెళ్లి చేసుకోనని చెప్పడంతో గురువారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చంద్రబాబు అబద్ధాలకు హద్దు లేదు

● జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు
● మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకం
● విద్యార్థి, యువజన విభాగం నేతృత్వంలో నేడు చలో మెడికల్ కాలేజ్
● పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చలో మెడికల్ కాలేజీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అబద్ధాలు చెప్పడం గతం నుంచే వెన్నతో పెట్టిన విద్య అని కానీ ప్రస్తుత పరిపాలనలో అబద్ధాలకు హద్దులు లేకుండా పోతుండడం, దానికి అనుకూల మీడియా వంతపాడడం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం నేతృత్వంలో ఈ నెల 19న శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఆయన యువజన విభాగం, విద్యార్థి విభాగం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించారని ఆ సమయంలో రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించలేదన్నారు. కానీ 2019 నుంచి 2024 మధ్య జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభించి 2023 నాటికే ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అందులో భాగంగానే జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం, ఈ ఏడాది మూడో బ్యాచ్ అడ్మిషన్లు కూడా ప్రారంభమవుతుండడం చంద్రబాబుకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు కట్టలేని చంద్రబాబు ఉన్న కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు చూడడం అన్యాయమన్నారు.

విజయవంతం చేయాలి

పేదలకు మెరుగైన వైద్యం అందకూడదన్నదే చంద్రబాబు లక్ష్యమని దీనికి ప్రైవేటీకరణ నిదర్శనమన్నారు. అయితే పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం నియోకవర్గం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు బమ్మిడి కార్తీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, మీసాల రామారావు, పొంద్రంకి వాసు, అప్పికొండ ఆదిబాబు, కొసిరెడ్డి రమణ, ఇప్పిలి తిరుమల, డి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.